"ఆంటీ, రాధ భయపడుతోంది......" క్రిక్కిరిసిన కంపార్టుమెంటులోకి బాంబులా దూసుకు వచ్చింది ఆ వార్త. నిశ్శబ్దంగా కదులుతున్న రైలు పట్టాలకి చటుక్కున బ్రేకుపడినట్లయింది. ప్రయాణీకుల్లో చాలా మంది ఆడవాళ్ళు. ఎయిర్ కండిషన్డు స్లీపరు. పువ్వుల సిల్కు పరదా తొలగించి చూస్తున్న ఒక అమ్మాయి పై మాట మళ్లీ రెట్టించింది. సామాన్లు సర్దుకుంటున్న ఒక నడివయసు స్త్రీ అమాంతం లేచి నిలబడింది.

# రాధ భయపడుతోంది

## ఉషారాణి భాటియా

"అయ్యో! రాధకి ఏమయింది?....." అనడి గింది గొంతు జీరపోతుండగా, పక్కన కూర్చున్న మరో యిద్దరు స్త్రీలు ఆదుర్దాగా పరదా వైపు చూస్తున్నారు.

"రాధకి ఎక్కడా సీటు దొరకడం లేదు" అంటూ చొరవగా లోపలికి వచ్చింది ఆ అమ్మాయి.

"మాకు పక్క వింగ్‌లో దొరికింది. రాధ ఇప్పుడు మా దగ్గరే కూర్చుంది. కానీ....." అన్నది మళ్లీ. "మన మధ్య సర్దుకోవచ్చుగా...." ఒకామె సలహా ఇచ్చింది.

"అదెట్లా కుదురుతుంది? రెండు రాత్రిళ్ల ప్రయాణం. కంపార్టుమెంటులోని ఇతర ప్రయాణీకులు అభ్యంతరం చెప్పవచ్చు...." అందుకుంది మరొక ఆమె. ఆ అమ్మాయి ఆంటీ పక్కనే వచ్చి కూర్చుంది. తన మాటలకి ఆ ముగ్గురూ నడి వయసు స్త్రీలు ప్రకటిస్తున్న భావాలని గమనిస్తూంది.

"నేను మొదట్నుంచీ చెపుతూనే వున్నాను. సీటు వుందో లేదో ఖాయం చేసుకోకుండా రైలెక్కడం మంచిది కాదు. ఇలాటి తంటాలు వస్తే ఏం చేయటం? మన కూడా ఎవరూ మొగవాళ్లు లేరు" అంటూ మొదటి ఆమె మళ్లీ అందుకుంది.

"ఏ గుంటడు అయినా అయితే ఎలాగో అలాగ సర్దుకుపోయేవాడు. ఆడపిల్ల. అందులోనూ పడుచుపిల్ల. ఇప్పుడేం దారి?" రెండో ఆమె వాపోయింది. "కమలమ్మ ఆంటీ! మీరే ఏదయినా ఉపాయం ఆలోచించాలి, టి. సి. తో మాట్లాడుతారా?"

దుర్వార్త మోసుకొచ్చిన అమ్మాయి ప్రాధేయపూర్వకంగా అడిగింది.

ఒక్క కమలమ్మ ఆంటీ, ఆమె బృందానికే కాదు, చుట్టు ప్రక్కల కూర్చున ప్రయాణీకులకు కూడా ఆందోళన కలిగింది. వాళ్ల మధ్య కూర్చుని వుంది పార్వతమ్మ. దాదాపు వారి వయసు వుంటుంది. ఒంటరిగా ప్రయాణం చేస్తూంది. అతి కష్టం మీద పై బెర్తులో సీటు దొరికింది. కాలు కదిపేందుకు చోటు లేదు. నాలుగు ప్రక్కలా సామాన్లు. కాళ్లు ముడుచుకుని ఇబ్బందిగా కూర్చున్న పార్వతమ్మ వాళ్ల మాటలు విని కొంచెం కదిలింది. పరిస్థితి కొద్దిగా అవగాహన అయింది. ముగ్గురు నడి వయసు స్త్రీలు చదువుకుంటున్న కొందరు విద్యార్థినుల్ని వెంట తీసుకుని ప్రయాణం చేస్తున్నారు. కూడా ఎవరూ పురుషులు లేరు. అందరికీ ఒకచోట కూర్చునే సదుపాయం దొరకక చెల్లా చెదరు అయారు.

ఆ రాధ ఎవరో చాలా కష్టంలో వుంది. అసలు సీటే దొరకలేదు. కమలమ్మ టి. సి. ని కలుసుకోవడానికి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేంత వరకు మిగతా ప్రయాణీకులు తమ అనుమానాలు, భయాలు గట్టిగా ప్రకటించుకోసాగారు. రైలు ప్రయాణపు కష్ట సుఖాలు, ముందు ఏర్పాట్లు చేసుకోకుండా ఇల్లు కదలడం లోని మూర్ఖత్వం, సమయానికి ఆదుకోలేని రైల్వే సిబ్బంది - యిలా అనేక విషయాలని గురించి ఒకేసారి గొంతెత్తి చర్చించుకుంటున్నారు. ఎన్నడూ ఎక్కువగా మాట్లాడని పార్వతమ్మ కూడా వారి సంభాషణలో పాల్గొంది.

ఇంతలో కమలమ్మ తిరిగి వచ్చింది. "ఏమయింది? దొరికిందా?" అడిగారు అంతా ఏకకంఠంతో.

"వెయిటింగ్ లిస్టులో చాలా మంది వున్నారు. ఏం ఆశలేదు. ఫస్టు క్లాసులో కావాలంటే ప్రయత్నిస్తానన్నాడు. అదీ ప్రయత్నం మటుకే...." అందామె నీరసంగా.

రాధ సమస్య ఇప్పుడు కమలమ్మబృందంది మటుకే కాదు. పార్వతమ్మది కూడా అయింది. అందుకే ఆమె తల వేడెక్కేలా ఆలోచిస్తోంది. పోనీ ఆ రాధ అనే అమ్మాయిని తనతోబాటు పై బెర్తులో పడుకోమంటే అనుకుంది ఒక క్షణం. కానీ వెంటనే తనని తాను సంబాళించుకుంది. రాధ చంటిపిల్ల కాదు. ఇరవై ఏళ్ల పడుచు. కాళ్లు జాపుకుని పడుకోకపోతే తనకి నడుంనొప్పి వస్తుంది. రైలు దిగి నప్పటి నుంచీ మందులూ, డాక్టర్లూ అంటూ పరిగెత్తవలసి వస్తుంది. అంటూ సరిపెట్టుకుంది.

టి. సి. వచ్చి రెండు సార్లు కమలమ్మతో ఏదో మాట్లాడి వెళ్లాడు. సామాన్లు సర్దుకుని నెమ్మదిగా ప్రయాణీకులు కుదుటన పడ్డారు. స్టేషన్లు వచ్చిపోతున్నాయి. గంటలు గడుస్తున్నాయి. కొందరు నిద్రతో తూలుతున్నారు. కొందరు ఫలహారాలు సేవిస్తున్నారు. కానీ రాధ కబురేమీ పార్వతమ్మ చెవిన పడలేదు. రెండు మూడు సార్లు స్వయంగా అడిగింది కానీ సరైన జవాబు రాలేదు. బహుశా: ఎక్కడో సీటు దొరికి సర్దుకుని వుంటుంది అని సమాధానపడింది. రైల్లో దీపాలు కూడా వెలిగాయి.

ఉన్నట్లుండి పరదా తొలగింది. ముందు వచ్చిన పిల్ల మళ్లీ అక్కడ నిలబడింది.

"కమలమ్మ ఆంటీ! రాధకి ఫస్టు క్లాసులో సీటు దొరికింది" అన్నది.

"కానీ రాధ భయపడుతోంది ఆంటీ బోగీలోని

మిగతా ముగ్గురు ప్రయాణీకులు జెంట్స్!"

కమలమ్మ ముఖం వెల వెల బోయింది. మిగతా వారి వంక మౌనంగా చూసింది. పార్వతమ్మ కయితే గాభరాతో గొంతు మూసుకుపోయింది. ఓ నిమిషం ఎవరూ మాట్లాడలేదు.

"ఉండండి. కాస్త టి. సి. తో మాట్లాడి వస్తాను" అంటూ కమలమ్మ లేచింది. వేగంగా బైటికి నడిచింది.

నాలుగు పక్కలా దీకట్లు క్రమ్ముకున్నాయి. కమలమ్మ వెళ్లి చాలా సేపయింది. బహుశా: ఆ రాధని ఓదారుస్తూ వుండి వుంటుంది. మరొక చోట సీటు మార్పించి సామాన్లు సర్దుతూ వుంటుంది. ఇలా అనేక విధాలుగా ఆలోచించింది పార్వతమ్మ.

ఆఖరికి కమలమ్మ తిరిగి వచ్చింది. ఏం జరిగిందో అడిగేందుకు ఎవరికీ దమ్ములు లేవు. తనంతట తానే ఆమె చెబుతుందని ఎదురు చూస్తున్నారు. ఆమె చెప్పింది వాళ్ల అనుమానాన్ని ఖాయం చేసింది. రాధ సీటు మార్చేందుకు టి. సి. అంగీకరించలేదు. పైపెచ్చు కొన్ని అప్రియమైన మాటలు కమలమ్మ వినవలసి వచ్చింది. అసలు రిజర్వేషను లేకుండా రైలెక్కడం తప్పు. కాళ్లా వేళ్లా పడి బెర్తు దొరికాక ఇక్కడ కాదు అక్కడ, అహ - అక్కడ కాదు ఇక్కడ అని కోరికలు ప్రకటించడం పెద్ద తప్పు. సర్దుకుపోవాలి. ఈ మాటలు చెబుతున్నప్పుడు కమలమ్మ ముఖంలో కోపం, విచారం ప్రస్ఫుటమయ్యాయి. ఆమె చాలా కష్టంలో వుందని అనిపించింది పార్వతమ్మకి. అందుకనే చొరవ చేసుకుని యిలా అంది. "పోనీ అక్కయ్యగారూ, మనం ఒకపని చేయకూడదూ? కొంచెం వయసులో పెద్దవాళ్లం అక్కడికి వెళ్లి రాధని ఇక్కడికి రమ్మంటే...." అంటూ మధ్యలో ఆగిపోయింది.


అంతటి సంకట సమయంలోనూ ఆమె సూచన ఎవరికీ నచ్చినట్లు లేదు. కమలమ్మ మటుకు యిలా గొణిగింది.

"ఎండలు భయంకరంగా వున్నాయి. వేడి, దుమ్ము, ధూళి, తట్టుకునే వయసు కాదు మనది. రెండు రోజులు ఎలా గడపటం...."

ఆ మాటలు పార్వతమ్మకి విచిత్రంగా తోచాయి. అనుమానం కూడా కలిగింది. బహుశా: రాధ పిల్లెవరికీ దగ్గిర మనిషి కాదు. దూరపు బంధువో లేక పొరుగువారి అమ్మాయి అయినా అయివుండాలి. లేకుంటే ఈ విషయాన్ని అంత తేలికగ్గా తీసుకోరు అనుకుంది లోలోపల.

దుప్పట్లు కప్పుకుని అందరూ వారి వారి సీట్లలో సర్దుకుని పడుకున్నారు. పార్వతమ్మ కూడా కొంత కష్టపడి పై బెర్తు ఎక్కింది. ఒక చిన్న దీపం తప్ప అన్ని దీపాలు ఆరిపోయాయి. ప్రయాణ బడలికతో అలసిపోయిన ఆమె శరీరం చిన్నని పరుపు తగలగానే విశ్రాంతి కోరింది. కానీ ఆమె మనసు మటుకు విశ్రాంతి చెందలేదు. ఆలోచనలు వేగంగా పరుగెడుతున్నాయి. తాను పరిచయం లేని, ఎన్నడూ చూడని, ఎవరో తెలియని రాధ గురించి ఆలోచిస్తుంది. వయసు పిల్ల. ఎంత భయపడుతోందో ఏమో! ఒంటరిగా ప్రయాణం. అదీ కొత్త మనుషుల మధ్య. ముగ్గురు పురుషుల మధ్య. పగలే వారి మధ్య కూర్చోవటం కష్టం. అందులో రాత్రిళ్ళు, రెండు రాత్రిళ్లు గడపటం మాటలా! పోనీ ఈ ప్రపంచంలో మంచివాళ్లు తప్పకుండా వుంటారు అని సరిపెట్టుకుందా మనుకుంటే - ముగ్గురూ మంచివాళ్లే అవుతారని హామీ ఏమిటి? వారిలో ఒక్కడు పోకిరీ అయినా చాలు, ఆ పిల్ల పరిస్థితి భరించరాని దవుతుంది.

ఇలాంటి ఆలోచనలతో పార్వతమ్మ బుర్ర వేడెక్కింది. రాకూడని ఎన్నో ఊహలు మనసు ముందు



నిలిచాయి. జ్ఞాపక శక్తి కూడా చురుగ్గా పనిచేయసాగింది. కొడుకు కోడలితో ఆమె అడపా తపడా సినిమాలకి వెళ్లేది. వాటిలో కొన్ని దృశ్యాలు ఆమెకి భయం, జుగుప్స కలిగించేవి. అవన్నీ వరుసగా ఆమెకి గుర్తుకి వచ్చాయి. ఒక దృశ్యం - నిస్సహాయ స్థితిలో వున్న రాధని ఒక లావుపాటి వ్యక్తి వేధిస్తున్నాడు. అతని ముఖం అచ్చం గిరిబాబు ముఖంలా వుంది. రెండో దృశ్యం - గాఢ నిద్రలో వున్న రాధ వెనుకగా ఒక పెద్ద ఆకారం ఒంగుతోంది. ఆకారంలోని వ్యక్తి అచ్చం సత్యనారాయణలా వున్నాడు. మూడో దృశ్యంతో పార్వతమ్మ లేచి కూర్చుంది. అందులో - వేగంగా పరుగెడుతున్న రైలులోంచి రాధ నిలువునా కిందికి దూకేసింది. పార్వతమ్మ కళ్లు నలుముకుని కిందికి చూసింది. అందరూ గాఢ నిద్రలో వున్నారు. కమలమ్మ మటుకు దిండుకి ఆనుకుని కూర్చుని వుంది. బహుశా నిద్ర రావడం లేదు కామోసు. తన లాగే ఆలోచిస్తోంది, అనుకొంది పార్వతమ్మ.

ఆమెకి ఎప్పుడు కునుకు పట్టిందో తెలియదు. కీచుమని రైలు ఆగిన కుదుపుతో మెళకువ వచ్చింది. తెరిచిన కళ్లు మళ్లీ బడలికతో మూతపడ్డాయి. దుప్పటి పైకి లాక్కుని ముడుచుకుని పడుకుంది.

కానీ కింద బెర్తులో గట్టిగా మాటలు వినపడి మేలుకుంది.

"ఎలా వున్నావు రాధా?"

"సరిగా నిద్ర పట్టిందా?"




"భయపడలేదు కదా! ఇలా వచ్చి కూర్చోమ్మా"

ప్రశ్నల వర్షం కురుస్తోంది. పార్వతమ్మ వుండబట్ట లేకపోయింది. కళ్ళు బాగా తెరిచి ఒత్తిగిలింది. మెడ సాచి కిందికి తొంగి చూసింది. తలల గుంపులో రాధని తెలుసుకోవడం కష్టమయింది. కానీ ఆమె తన శక్తినంతా కూడకట్టుకుంది. పూర్తి తలని కిందికి వేలాడేసి చూసింది.

సన్నగా, పొడుగ్గా, ఛామనచాయ రంగులో వుంది. ఆకర్షణీయమైన ముఖ కవళికలు. చూపులు శాంతంగా వున్నాయి. బుజాల కిందికి ఒత్తుగా రెండు జడలు, చేతులు లేని రవిక. పువ్వుల వాయిల్ చీర. కాళ్లకి ఎత్తయిన చెప్పులు - రాధ. ప్రశ్నలడుగుతున్న వారి వంక నింపాదిగా చూసింది. కిటికీకి చేరువగా వెళ్లి కూర్చుంది. చేతిలోని ట్రాన్సిస్టరు బటను నొక్కింది. జంయ్ మని పాట వస్తుంటే, గానంలో లీనమయిపోయింది.

"కమలమ్మ ఆంటీ! నా నిద్ర కొంచెం కూడా డిస్టర్బ్ కాలేదు. అసలు ఎలా తెల్లవారిందో కూడా తెలియదు. నో ప్రాబ్లెమ్స్" అంది మామూలుగా.

పార్వతమ్మ నింపాదిగా తలపైకి తీసేసుకుంది. సర్దుకుని పక్కకి తిరిగి పడుకుంది. కొడుకు మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"చూడమ్మా, రోజులు మారిపోయాయి. చెల్లాయికి నువ్వు ఆంక్షలు పెట్టి లాభం లేదు. దానికి కొంచెం స్వతంత్రం ఇవ్వు. నమ్మకం వుంచు. మంచి చెడు స్వయంగా తెలుసుకునేందుకు అవకాశం ఇవ్వు. ఈ కాలపు ఆడపిల్లలు నువ్వు భయపడేంత పిరికి వాళ్లు కారు. తెలివి గల వాళ్లు. లోక జ్ఞానం అలవర్చుకున్నారు. కొన్ని పరిస్థితుల్ని ధైర్యంగా, తెలివిగా ఎదుర్కొగల శక్తి వాళ్లకుందని మరిచిపోక. బాధ్యతల్ని యిస్తేనే వాళ్లు ముందుకి నెట్టుకు రాగలరు."

పార్వతమ్మ మళ్లీ ఓ మాటు కిందికి తొంగి చూసింది. కిటికీ దగ్గిర కూర్చున్న రాధలో తన కూతుర్ని చూసుకుంది. మనసు తృప్తితో నిండిపోయింది


*దీపావళి శుభాకాంక్షలు!*

# కాకినాడ మునిసిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్

(రిజిష్టర్డ్ నెం: 22/69)

కాకినాడ

ప్రెసిడెంట్: శ్రీ పి. శ్రీనివాసరావు    కార్యదర్శి: శ్రీ ఎన్.వి. రామారావు

వైస్ ప్రెసిడెంట్: శ్రీ కె. కృష్ణమూర్తి    ఉపకార్యదర్శి: శ్రీ వి. సోమరాజు